క్లుప్తంగా

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

కందుకూరు: మండలంలోని ముచ్చర్ల అనుబంధ గ్రామం ఊట్లపల్లి పరిధిలోని దేవునిగుట్టపై కొలువైన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తేరటి లక్ష్మయ్యముదిరాజ్ తెలిపారు. ప్రతి రోజు అన్నదానం చేయనున్నామన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి

తుక్కుగూడ: జిన్నాయిగుట్ట ఛత్రగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం నవకళశ స్నపనం, ధ్వజారోహణం, పూర్ణాహుతి, యజ్ఞయాగాలు, స్వామివారికి చందనం, ప్రత్యేక అలంకరణ వంటి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పూజారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శిథిలావస్థ భవనాలను గుర్తించండి

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీ వ్యాప్తంగా పాత, శిథిలావస్థ గృహాలను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. రోడ్లు, వీధుల్లో వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ భార్గవ్ రెడ్డి, టీపీఎస్ వెంకటరఘునాథ్, మల్లేశ్, వార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయాన్ని తరలించొద్దు

కాంగ్రెస్ నేత రవూఫ్

పహాడీషరీఫ్: బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని బాలాపూర్ గ్రామంలోనే యథావిధిగా కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ అబ్దుల్ రవూఫ్ కోరారు. జల్‌పల్లిలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని బడంగ్‌పేటకు తరలించాలన్న ఆలోచన పట్ల రెవెన్యూ అధికారులు పునరాలోచించాలన్నారు. అలా తరలించినట్లయితే జల్‌పల్లి మున్సిపాలిటీ ప్రజలకు దూరభారం అవుతుందన్నారు. దీంతోపాటు పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు కలిగిన ఈ ప్రాంతంపై రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కూడా కరువయ్యే అవకాశం ఉంటుందన్నారు. కార్యాలయ భవనం ఇబ్బంది ఉందనుకుంటే.. జల్‌పల్లికి కార్యాలయాన్ని తరలించాలని ఆయన కోరారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు.

చిరస్మరణీయుడు సుందరయ్య

ఎంప్లాయీస్ వాయిస్ పత్రిక ఎడిటర్ వెంకటేశ్వర్లు

తలకొండపల్లి: దళితుల హక్కులు, స్త్రీల సమానత్వం, పేదల సంక్షేమం కోసం పోరాడిన మహనీయుడు పుచ్చపల్లి సుందరయ్య అని ఎంప్లాయీస్ వాయిస్ పత్రిక ఎడిటర్ కె.వెంకటేశ్వర్లు కొనియాడారు. మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్‌లో సీపీఎం నాయకులు, కామ్రేడ్ వెంకటయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జెండాను ఆవిష్కరించారు. ఎంప్లాయీస్ వాయిస్ పత్రిక ఎడిటర్ వెంకటేశ్వర్లు, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షుడు జగన్ ముఖ్య అతిథులుగా హాజరై సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన పాటలు అలరించాయి. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడుఆంజనేయులు, అంబేద్కర్, పూలే జాతర కమిటీ నాయకులు సుధాకర్, కేవీపీఎస్ జిల్లా నాయకులు చెన్నయ్య, జగన్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కిషోర్, డీవైఎఫ్ఐ ఆమనగల్లు ఏరియా కమిటీ కార్యదర్శి శివశంకర్, ఎల్బీనగర్ డివిజన్ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు అరుణ్ కుమార్, సీపీఎం నాయకులు శ్రీనివాసులు, వెంకటయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులు..

లాభాలు దక్కు!

వరుస వర్షాలతో దుక్కులు దున్నుతున్న అన్నదాతలు

- వాతావరణశాఖ సూచన మేరకు సాగుకు సన్నద్ధం
- భూసార పరీక్షలు, విత్తన ఎంపిక ప్రధానమంటున్న వ్యవసాయాధికారులు



మహేశ్వరంలో వేసవి దుక్కులు దున్నిన రైతు

మహేశ్వరం: గతకొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అన్నదాతలు దుక్కులు దున్నుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున వర్షాలు పడతాయంటూ వాతావరణ శాఖ సూచనల మేరకు సాగు పనులు చేసుకునేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. తొలకరికి నెల ముందు సాగుకు సన్నద్ధమైతే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. సాగు ఖర్చు అంచనా రూపొందించుకోవాలంటున్నారు. సాగు విస్తీర్ణం మేరకు విత్తనాలు, కూలీలు, ఎరువులు కొనుగోలు వ్యయాన్ని సమకూర్చుకుంటే ఇబ్బంది ఉండదన్నారు.

వేసవి దుక్కులు కీలకం..

వర్షాకాలం సాగుకు ముందు నుంచి పొలాలను చదును చేసుకోవాలి. తొలకరికి ముందే విత్తుకోవడానికి సిద్ధం చేసుకోవాలి. పంటల కోతల అనంతరం భూమిని వృథాగా వదిలేయకుండా లోతుగా దుక్కి దున్నితే పంటలను ఆశించే చీడపురుగులను నివారించవచ్చు. అంతేకాకుండా వర్షాలు కురిస్తే నీరు భూమి లోపలి వరకు చేరుతుంది. మొదటిసారి దుక్కి దున్నిన తర్వాత రెండోసారి దున్నే ముందు పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు లేదా చెరువు మట్టిని పొలంలో వెదజల్లడం ద్వారా మంచి దిగుబడి సామర్థ్యం పెరుగుతుంది.

మూడు రకాలు..

వేసవి దుక్కులను లోతుగా, వాలుకు, అడ్డంగా దున్నుకోవాలి. వాలుకు అడ్డంగా దున్నుకోవడం వలన వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహిస్తుంది. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వేసవి దుక్కులకు ముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడం వల్ల వాటి విసర్జక వ్యర్థాలు సేంద్రియ ఎరువుగా మారి భూమిలోకి చేరుతాయి. అవి భూసారవృద్ధికి తోడ్పడుతాయి. అలాగే గత పంటకు సంబంధించిన ఆకులు, మొదళ్లు, చెత్తాచెదారం నేల పొరల్లో కలిసిపోయి, ఎరువుగా మారుతాయి. రాబోయే పంటకు కావాల్సిన పోషక పదార్థాలను అందిస్తాయి.

పత్తి, వరి మొదళ్లను భూమిలో కలపడం

ప్రతి సంవత్సరం పత్తి దిగుబడి అనంతరం రైతులు పత్తి మొదళ్లను కోసి తగులబెడుతుంటారు. పత్తి మొదళ్లు వృథా పోకుండా భూమిలో తేమ ఉన్నప్పుడు రోటవేటర్‌తో కలియదున్నాలి. ఇలా చేయడం వలన భూమి సారవంతం పెరగడమే కాకుండా రసాయన ఎరువులు వాడకం తగ్గించవచ్చు. అలాగే వరిపంటను కోసిన తర్వాత వరి మొదళ్లను భూమిలో కలిపేసి దున్నాలి.

సేంద్రియ ఎరువుల వాడకం..

సేంద్రియ ఎరువులు నేలలోకెళ్లి ఖనిజ పొరల్లో అభివృద్ధి చెంది పంటకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలను అందిస్తాయి. నేల రసాయనిక, భౌతిక, జీవగుణాలపై ప్రభావం చూపి నేల సత్తువ, ఉత్పాదక శక్తిని పెంచుతాయి. పశువుల ఎరువులు, కోళ్లు, గొర్రెలు, మేకల, వానపాముల ఎరువులను ఎకరానికి సుమారు 2-4 టన్నుల వరకు వాడవచ్చు. విత్తడానికి 20-25 రోజుల ముందే సేంద్రియ పదార్థం వాడటం వలన భూమి గట్టిపడకుండా వదులుగా ఉంటుంది. నీరు బాగా ఇంకటం వలన తేమ గణనీయంగా పెరిగి విత్తనం బాగా మొలకెత్తుతుంది.

విత్తనోత్పత్తితో మేలు..

సాగులో విత్తనాల ఎంపిక ప్రధానం. పలు రకాల కంపెనీల విత్తనాలు మార్కెట్లో అందుబాటులో సిద్ధంగా ఉన్నాయి. ఆయా కంపెనీల డీలర్లు రైతులను ఆకట్టుకునేల ప్రచారం చేస్తున్నారు. దీంతో ఏ కంపెనీ నాణ్యమైన విత్తనాలను అందిస్తుందనే విషయంలో రైతులకు అవగాహన లేకుండా పోతుంది. ప్రతి సంవత్సరం ఏదో ఒక కంపెనీ విత్తనాలను వేసుకునేకంటే నాణ్యమైన విత్తనాలను రైతులే విత్తనోత్పత్తికి తోడ్పడితే మేలు.

భూసార పరీక్షలు చేయించాలి



భూమిలో ఎంతవరకు సారం ఉందని తెలుసుకునేందుకు ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించాలి. అధిక దిగుబడికి పోటీపడి నష్టాలు కొని తెచ్చుకోవడం కంటే రైతులు భూసార పరీక్షలు చేయించి విలువలు తెలుసుకొని కాలానుగుణంగా సాగుతీరు మార్చుకోవడం వలన మంచి ఫలితాలు సాధించవచ్చు. ఇసుక నేలలు, ఒండ్రు, రేగడి, బంకమట్టి, నీరు నిలిచే తదితర నేలలకు అనుగుణంగా విత్తనం విత్తుకోవడంతో ఆశించిన దిగుబడి సాధించవచ్చు. రైతులు మూడు పంటలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించాలి.

– సుజాత, ఏడీఏ, మహేశ్వరం

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు

రాకపోకలకు ఇబ్బంది

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి రాఘవేంద్రనగర్ కాలనీలో నడిరోడ్డుపై విద్యుత్ స్తంభాలు ఉండటంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. పోస్టాఫీసుకు వెళ్లేదారి కావడం, దీనికి తోడు దారి ఇరుకుగా ఉండటంతో పాటు రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభాలు ఉండటంతో అవస్థలు పడుతున్నామని వాహనదారులు తెలిపారు. కార్లు, ఇతర పెద్ద వాహనాలు రాలేని పరిస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. నడిరోడ్డుపై ఉన్న స్తంభాలను తొలగించాలని కొన్నేళ్లుగా విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్తంభాలను పక్కకు తరలించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



రాఘవేంద్రనగర్ కాలనీలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

నూతన రోడ్డు నిర్మాణం పై హర్షం



ఎంఐఎం నేత హసన్‌షాను సన్మానించిన స్థానికులు

పహాడీషరీఫ్: ఎర్రకుంటలో నూతన రోడ్డు నిర్మాణం పూర్తి కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రూ.40 లక్షల వ్యయంతో ఈ రోడ్డు నిర్మించడం పట్ల మజ్లిస్ నాయకుడు హసన్‌షాను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా హసన్‌షా మాట్లాడుతూ.. వార్డు నంబర్-1లోని ఉమర్ ఫారూఖీ మజీద్ ప్రాంతంలో నూతన రోడ్డు ఆవశ్యకతను స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి, చైర్మన్ అబ్దుల్లా సాదికి విన్నవించిన వెంటనే రూ.40 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ప్రస్తుతం ఈ పనులు పూర్తిచేసుకొని ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు హుస్సేన్, తాలెబ్ దయానీ, ఇబ్రహీం, అలీ జాబ్రీ, హామెద్, హబీబ్ పాల్గొన్నారు.

కొత్తగూడలో తెగిపడిన విద్యుత్ తీగ

- విద్యుత్ సరఫరాను నిలిపివేసిన అధికారులు
- ఇళ్లపై నుంచి పక్కకు తరలించాలని గ్రామస్తుల డిమాండ్



కొత్తగూడలో తెగిపడిన 11 కేవీ విద్యుత్ తీగ

కందుకూరు: ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగ తెగిపడగా.. గుర్తించిన స్థానికులు సకాలంలో విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. వివరాలు. కొత్తగూడ గ్రామంలోని ఇళ్ల మీదుగా 11 కేవీ విద్యుత్ లైన్ ఉంది. కాగా ఉదయం ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తెగిపడింది. విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు విద్యుత్ అధికారులకు వెంటనే సమాచారం అందించారు. దీంతో వారు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కాగా గ్రామం మీదుగా ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించాలని గతంలో ఎన్నిమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, ఇప్పటికి మూడు పర్యాయాలు తీగలు తెగాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇళ్లపై నుంచి లైన్‌ను తొలగించి వేరేచోట నుంచి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కొంతసేపు మరమ్మతులు చేయనీయకుండా అడ్డుకున్నారు. సమస్య త్వరలో పరిష్కరిస్తామని, అప్పటి వరకు మరమ్మతులు చేయనీయండని అధికారులు కోరడంతో పనులు చేయడానికి అంగీకరించారు.

నిబంధనలు పాటించాలి

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: ఉపాధి పనుల్లో నింబంధనలు పాటిస్తేనే కూలీ గిట్టుబాటు అవుతుందని.. సమయం వృథా చేసుకోకుండా పనులు చేయాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి ఉపాధి కూలీలకు సూచించారు. యాచారంలో సోమవారం ఆయన ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా కూలీలు నింబంధనల మేరకు ఉపాధి పనులు చేయాలని సూచించారు. కూలీలు ప్రారంభించే సమయం, ముగించే సమయాల్లో ఖచ్చితంగా ఫోటోలు తీసి ఉంచాలని సిబ్బందికి సూచించారు. పనులు చేసిన వెంటనే పేస్లిప్పులు అడగాలని, వేతనాల్లో జాప్యం జరిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని కూలీలకు సూచించారు. వర్షాలు సంవృద్ధిగా కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు అన్ని గ్రామాల్లో గుంతలు సిద్ధం చేసి ఉంచాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్,వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 23, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 35, క్యాలీఫ్లవర్18, క్యాబేజీ 18, క్యారెట్ 35. దొండ 28, ఆలు 28, ఉల్లి 24, గోకర 40, దోస 23, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 70, అర్వి 43, మునగ 40, చిలగడదుంప 70, బీట్‌రూట్ 21, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 90, కాప్సికమ్ 55. ఈధరలు మంగళవారం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

పరమేశ్వర కాలనీ అధ్యక్షుడిగా వెంకన్నగౌడ్

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని పరమేశ్వర కాలనీ రెసిడెన్స్ అసోషియేషన్ అధ్యక్షుడిగా సుంకరి వెంకన్నగౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కాటిపల్లి ముత్తయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా అక్కి రమేష్, కోశాధికారిగా రాపోలు జ్ఞానేశ్వర్ ఎన్నికయ్యారు.

బాలాపూర్ తహసీల్ కార్యాలయం

బడంగ్‌పేటకు తరలింపు



బాలాపూర్ నూతన తహసీల్దార్ కార్యాలయం

బడంగ్‌పేట్: ఎన్నోరోజులుగా ఎదురుచూసున్న బాలాపూర్ తహసీల్దార్ అండ్ జాయింట్ సబ్‌రిజిస్టార్ కార్యాలయం ఎట్టకేలకు సోమవారం బడంగ్‌పేటకు షిఫ్ట్ అయ్యింది. తెల్లవారు జామునే తహసీల్దార్ మాధవిరెడ్డి, డీటీ మణిపాల్‌రెడ్డి బడంగ్‌పేటలోని పాత మున్సిపల్ కార్పొరేషన్‌లో పూజలు నిర్వహించారు. కందుకూర్ ఆర్డీఓ సూరజ్ కుమార్ ముఖ్యులుగా విచ్చేసి బడంగ్‌పేటలో కొత్తగా ఏర్పాటు చేసిన బాలాపూర్ కార్యాలయాన్ని పరిశీలించారు. వసతులను గదుల కేటాయింపులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో మేయర్ చాంబర్‌ను తహసీల్దార్ చాంబర్‌గా, టీపీఓ సెక్షన్ గదిని డీటీ కార్యాలయంగా మార్చుకుని పూజలు నిర్వహించారు. పై అంతస్తులో గతంలో కమిషనర్ చాంబర్‌ను రెవెన్యూ రికార్డులు భద్రపరిచే గదిగా మార్చారు. మేనేజర్, ఆర్ఐ గదులను గిర్దావర్‌కు, వచ్చిన ఫైళ్లను చెకింగ్ చేసి ఓకే చేసే సెక్షన్‌గా సిబ్బందికి, జూనియర్, సీనియర్ అధికారుల సెక్షన్ సిబ్బందికి మార్పులు చేశారు. గతంలో మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌కు వాడుకునే సమావేశ మందిరాన్ని అలాగే ఉంచి సౌకర్యాలు సమకూరిన తర్వాత రెవెన్యూ అత్యవసర మీటింగ్‌లకు వాడనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో గతంలో మున్సిపల్ బిల్లులు కట్టుకునే చోటును ఇన్‌వార్డుగా వాడుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇకనుంచి రెవెన్యూ సేవలు, అర్జీలు, ఎమర్జెన్సీ ఫిర్యాదులు, ఇతర దరఖాస్తులను బడంగ్‌పేట్ పాత మున్సిపల్ కార్యాలయం నుంచే కొనసాగుతాయని తహసీల్దార్ మాధవిరెడ్డి తెలిపారు. మండల పరిధి కిందకు వచ్చే బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

నెలలో సీసీ రోడ్లు పూర్తిచేస్తాం

కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: వచ్చే జూన్ 20 లోపు రూ. 1.90 కోట్ల నిధులతో పలు కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయనున్నామని, ఇందుకు సంబంధించి నిధులు మంజూరయ్యాయని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీ నుంచి పలు కాలనీల మీదుగా అనురాధా కాలనీ హెచ్‌పీ పెట్రోల్ బంక్ వరకు నిర్మించే సీసీ రోడ్డు పనులను సోమవారం జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ ఏఈ ప్రజ్ఞ, పలు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో ఆయన పర్యవేక్షించారు. గతంలో క్రిస్టియన్ కాలనీ నుంచి అనురాధా కాలనీ వరకు రెయిన్ వాటర్ పైప్‌లైన్ కోసం రోడ్ల తవ్వకాలు చేపట్టారని, ప్రస్తుతం ఆ రోడ్లలో సీసీ రోడ్డును తిరిగి నిర్మించడం జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు రాజిరెడ్డి, నర్సిరెడ్డి, హరిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తయ్యేనా?

- నిధుల లేమితో నిలిచిన ఎంపీడీఓ భవన నిర్మాణం
- అద్దె భవనం, అరకొర వసతులతో నిర్వహణ
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



స్లాబ్‌కే పరిమితమైన ఎంపీడీఓ కార్యాలయ భవనం

కడ్తాల్: మండలాలు, జిల్లాల పునర్విభజనలో భాగంగా నూతన మండలంగా ఏర్పడటంతో పాటు రంగారెడ్డి జిల్లాలో కలిసిన కడ్తాల్ మండల కేంద్రంలో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కార్యాలయాల నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. ప్రజల ఆకాంక్ష మేరకు నూతన మండలంగా ఏర్పడిన కడ్తాల్‌లో అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగడంలేదని సర్వత్రా విమర్శలు వినపడుతున్నాయి. ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణానికి 2023 ఏడాది సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినా నిధుల లేమితో గ్రౌండ్‌ఫ్లోర్ స్లాబ్ వరకే పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఎంపీడీఓ కార్యాలయం 8 సంవత్సరాల నుంచి అద్దెభవనంలో అరకొర వసతుల మధ్య అనేక ఇక్కట్ల మధ్య కొనసాగుతోంది. కేవలం 5–6 గదులు ఉన్న భవనంలోనే ఈజీఎస్ కార్యాలయ పనులతో పాటు మండల పరిషత్ కార్యక్రమాలను కొనసాగిస్తూ వస్తున్నారు. మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి కూడా సరైన భవనం లేకపోవడంతో రేకుల షెడ్డులో నిర్వహించాల్సిన పరిస్థితి. త్వరగా నూతన భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలని అధికారులు, ప్రజలు కోరుతున్నారు. అలాగే మిగిలిన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులను కూడా త్వరగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తి పనులు..

జనానికి అవస్థలు



హస్తినాపురం డివిజన్ విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీలో కంకర పోసి వదిలేసిన రోడ్డు



ఇటీవల కురిసిన వర్షానికి కాలనీ రోడ్డులో కొట్టుకుపోయిన కంకర

హస్తినాపురం: ఇటీవల కురిసిన అకాల వర్షం వల్ల వరదనీటి ముంపు సమస్య ఎలా ఉన్నా అసంపూర్తిగా ఉన్న పనుల కారణంగా తాము అవస్థలు పడుతున్నామని హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఆయాకాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం డివిజన్ పరిధిలో గల వివిధ ప్రాంతాలలోని కాలనీలలో రోడ్డు పనులు ప్రారంభమై నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయడం లేదని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీలో గత రెండు నెలల క్రితం కాలనీలోని అంతర్గత రోడ్లు వేసేందుకు పనులు ప్రారంభించగా కాంట్రాక్టర్ కేవలం రోడ్డుపై కంకరపోసి వదిలివేయడంతో కాలనీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసుల వాపోతున్నారు. గత రెండు నెలలుగా కాలనీలో రోడ్డుపై పోసిన కంకర మూలంగా తరచూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కనీసం రోడ్డుపై ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని, కాలినడకన కూడా నడవలేని పరిస్థితి నెలకొన్నదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కాలనీలో నెలకొన్న ఇబ్బందుల గురించి సంబంధిత శాఖ అధికారులకు వివరించినా ఎవరూ పట్టించుకోవడంలేదని ఇప్పటికైనా సంబందింత శాఖ ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను స్వయంగా సందర్శించి వాటిని పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.